


టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సునామీలో వైసీపీ కొట్టుకుపోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో తిరుగులేని ఆధిక్యతతో సాటిలేని విజయాన్ని సొంతం చేసుకుంది. బుధవారం ఆయా నియోజకవర్గాల్లో ఊరు.. వాడా.. విజయోత్సవాలతో సందడిగా మారాయి. పసుపు జెండా రెపరెపలతో పల్లెసీమలు కళకళలాడాయి. విజయోత్సవాల్లో విజేతలు మునిగిపోయారు. పోలింగ్ కేంద్రాలు వారిగా వచ్చిన ఓట్లు.. మెజార్టీపై సమీక్షలు నిర్వహించారు. పేదలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం..! అన్న నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ జెండా భుజానికెత్తుకున్నారు. ఆనాటి నుంచి ఇప్పటి దాకా జరిగిన ఈ ఎన్నికల గెలుపోటములను పరిశీలిస్తే.. కర్నూలు పార్లమెంట్, కర్నూలు, కోడుమూరు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ చారిత్రక విజయం సొంతం చేసుకుంది. చేనేతపురి ఎమ్మిగనూరులో మళ్లీ బీవీ కుటుంబానికి పట్టం కట్టడం ప్రగతికి సంకేతమంటూ టీడీపీ సంబరాలు చేసుకుంది.

- కర్నూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి)

సాటిలేని విజయం



- పల్లె.. పట్నం అంతటా స్పష్టమైన ఆధిక్యత
- కర్నూలు పార్లమెంట్ సహా కర్నూలు, కోడుమూరు, పాణ్యంలో రికార్డు విజయం
- కమలం వికాసంతో బీజేపీలో ఆనందోత్సాహం
- ఎమ్మిగనూరులో బీవీ కుటుంబానికే పట్టం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబీ నియోజకవర్గాలకు మే 14న పోలింగ్ జరిగింది. మంగళవారం ఓట్ల లెక్కింపు పూర్తి చేశారు. 1999 ఎన్నికల తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ జిల్లాలో చెప్పుకోదగ్గ స్థానాలు టీడీపీ దక్కించుకోలేకపోయింది. కారణం.. రాయలసీమ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న అభిమానం, 2004 ఎన్నికల తరువాత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముద్ర అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తాజాగా జరిగిన ఈ ఎన్నికల్లో రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు 12 అసెంబ్లీ స్థానాలు దక్కించుకుంది. కందనవోలు గడ్డపై ఇది ఓ చరిత్ర అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అదే క్రమంలో ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాలు కూడా స్వల్ప తేడాతో ఓడిపోవడం, అక్కడ బరిలో దిగిన అభ్యర్థులు స్వయంకృతాపరాధం వల్ల కూడా టీడీపీ ఓటమి చెందిందని, లేదంటే క్లీన్‌స్వీప్ అయ్యేదని విశ్లేషిస్తున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే.. 10.45 శాతం పోలింగ్ పెరగడం అసాధారణ విషయం. యువగళం పేరిట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టి పాదయాత్ర, టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు ఏపీకి ఇదేం ఖర్మ, బాదుడే.. బాదుడు, ప్రజాగళం పేరిట ప్రతి నియోజకవర్గంలో పర్యటించి కార్యకర్తల్లో భరోసా, జోష్ పెంచడం కందనవోలు గడ్డపై టీడీపీ భారీ విజయానికి ప్రధాన కారణమని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

● కర్నూలు ఎంపీగా బస్తిపాటి నాగరాజు సరికొత్త రికార్డు:



కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పంచలింగాల బస్తిపాటి నాగరాజు విజయం సాధించి సరికొత్త రికార్డు సొంతం చేసుకున్నారు. 1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత 11 పర్యాయాలు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. 1984లో జరిగిన ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏరాసు అయ్యపురెడ్డి విజయం సాధించి తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఆ తరువాత 1999లో ఒక్కసారి టీడీపీ గెలిచింది. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేఈ కృష్ణమూర్తి కాంగ్రెస్ అభ్యర్థి కోట్ల విజయభాస్కరరెడ్డిపై పోటీ చేసి 24,489 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన 2004, 2009 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వరుసగా విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి డాక్టర్ సంజీవకుమార్ గెలిచారు. అంటే.. 40 ఏళ్లలో 11 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు కేవలం రెండుసార్లు మాత్రమే ఎంపీగా గెలిచారు. 25 ఏళ్ల తరువాత టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు కర్నూలు ఎంపీగా వైసీపీ అభ్యర్థి, కర్నూలు మేయర్ బీవై రామయ్యపై 1,11,298 ఓట్లు మెజార్టీతో విజయం సాధించి సరికొత్త రికార్డు నమోదు చేశారు. 1989, 2004, 2019 ఎన్నికల్లో మాత్రమే ఎంపీ అభ్యర్థులు లక్ష పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. ఆ తరువాత బస్తిపాటి నాగరాజు ఆ ఘనత సాధించారు.

ఆ నియోజకవర్గాల్లో టీడీపీ చారిత్రక విజయం









కర్నూలు, కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గాల్లో కూడా టీడీపీ చారిత్రక విజయం దక్కించుకుంది. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో కర్నూలు ఎమ్మెల్యేగా పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి వి. రాంభూపాల్ చౌదరి విజయం సాధించారు. ఆ తరువాత ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా టీజీ వెంకటేశ్ రెండోసారి గెలిచారు. 40 ఏళ్లలో రెండు సార్లే టీడీపీ గెలిచింది. 25 ఏళ్ల తరువాత ఇప్పుడు టీజీ భరత్ టీడీపీ అభ్యర్థిగా 18,876 ఓట్లతో విజయం సాధించారు. టీడీపీకి రికార్డు విజయం అందించారు. కోడుమూరు నియోజకవర్గం నుంచి 1985లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎం. శిఖామణి విజయం సాధించారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఒక్కసారి తప్ప కోడుమూరులో టీడీపీ గెలవలేదు. 40 ఏళ్ల తరువాత టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి 21,583 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి రికార్డును నెలకొల్పారు. పాణ్యం నియోజకవర్గంలో పోటీ చేసి విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి గౌరు చరిత కూడా రికార్డు నెలకొల్పారు. 1983లో చల్లా రామకృష్ణారెడ్డి, 1999లో బిజ్జం పార్థసారథిరెడ్డి టీడీపీ అభ్యర్థులుగా విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఇక్కడ టీడీపీ గెలవలేదు. తాజాగా ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గౌరు చరిత ప్రత్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై 40,591 ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించారు. 25 ఏళ్ల తరువాత పాణ్యంలో టీడీపీ జెండా ఎగుర వేసి రికార్డును నెలకొల్పారు.

● బీవీ కుటుంబానికే పట్టం





ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి 1983లో సీఎం హోదాలో ఎమ్మెల్యేగా పోటీ చేసి కోట్ల విజయభాస్కరరెడ్డి విజయం సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ కోట్ల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్టీఆర్ ఆశీస్సులతో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బీవీ మోహన్‌రెడ్డి 1999 ఎన్నికల వరకు వరుసగా ఐదు పర్యాయాలు విజయం సాధించారు. ఆరుసార్లు మంత్రిగా పని చేశారు. బీవీ మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహిత సహచరుడిగా ఉంటూ వచ్చిన ఎర్రకోట చెన్నకేశవరెడ్డి టీడీపీ టికెట్ ఆశించడం, ఎన్టీఆర్ నిరాకరించడంతో 1994లో కాంగ్రెస్‌లో చేరారు. 1994, 1999 ఎన్నికల్లో బీవీ చేతుల్లో రెండుసార్లు ఓటమి చెందిన ఎర్రకోట 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన కూడా ఉప ఎన్నికతో కలిపి నాలుగు పర్యాయాలు గెలిచారు. 2014 ఎన్నికల్లో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన బీవీ జయనాగేశ్వరరెడ్డి పోటీ చేసిన తెలిసారే విజయం సాధించి ఎమెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019లో మళ్లీ ఎర్రకోట ఎమ్మెలేగా గెలిచారు. అంటే.. 1983 నుంచి 2024 వరకు 40 ఏళ్లు ఎమ్మిగనూరు నియోజకవర్గాన్ని బీవీ, ఎర్రకోట కుటుంబాలే పాలిస్తూ వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఎర్రకోటను కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ అభ్యర్థిగా బుట్టా రేణుకను బరిలోకి దింపారు. టీడీపీ అభ్యర్థిగా బీవీ జయనాగేశ్వరరెడ్డి సై అన్నారు. అయితే.. బుట్టా రేణుక గెలిస్తే 40 ఏళ్ల బీవీ, ఎర్రకోట కుటుంబాల పాలనకు తెర పడుతుందనే ప్రచారం జరిగింది. కానీ ఎమ్మిగనూరు ప్రజలు బీవీ కుటుంబాన్నే ఆదరించి జయనాగేశ్వరరెడ్డికే పట్టం కట్టడం కొసమెరుపు. బీవీ కుటుంబం నుంచి దివంగత బీవీ మోహన్‌రెడ్డి, ఆయన తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి 25 ఏళ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. తాజాగా మరో ఐదేళ్లు కూడా ఎమ్మెల్యేగా కొనసాగబోతున్నారు. ఇది కూడా ఓ రికార్డే.

నీట్‌లో మెరిసిన కర్నూలు విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 5: నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. గత నెల మే 5వ తేదీన నీట్ ప్రవేశ పరీక్ష (యూజీ) జరిగింది. కర్నూలు జిల్లాలో మొత్తం 4,944 మంది రిజిస్టర్ చేసుకున్నారు. 4838 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 106 మంది గైర్హాజరయ్యారు. కర్నూలుకు చెందిన టి.ఫణిధర్ రెడ్డి 700/720 మార్కులు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. అలాగే మహ్మద్ ఇర్ఫాన్ 685, గాజుల తేజసాయి 672, కె.తన్మయి 670, జీ.జీవన కుమార్ రెడ్డి 661, షేక్ మహ్మద్ షఫీ రోశన్ 658, కేవి వర్మ 656 మార్కులు సాధించారు. జనరల్ విభాగంలో కటాఫ్ 164, ఈడబ్ల్యూఎస్ 146, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 124 మార్కులు నిర్ణయించారు. ఈ మార్కుల ఆధారంగానే ఎంబీబీఎస్, ఇతర కోర్సుల్లో చేరడానికి అర్హత పొందుతారు.

● సంతోషంగా ఉంది



నీట్ ప్రవేశ పరీక్షల్లో 700/720 మార్కులు రావడం సంతోషంగా ఉంది. కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. అధ్యాపకుల కృషికి తోడు తల్లిదండ్రుల ప్రోత్సాహం మార్కుల సాధనకు ఎంతగానో తోడ్పడింది. కర్నూలు జోహరాపురం రోడ్డులోని సూర్య హాస్పిటల్ వ్యవస్థాపకులు డా.టీవీఎస్ రెడ్డి (న్యూరోసర్జన్), డా.శారద దంపతుల సంతానమైన నేను హైస్కూల్ విద్య కర్నూలు సెయింట్ జోసెఫ్ పాఠశాల, కర్నూలు నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య కొనసాగింది. ఇంటర్‌లో 982 మార్కులు వచ్చాయి. దేశంలోని ప్రముఖ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చేయాలన్నదే లక్ష్యం.

- టి. ఫణిధర్ రెడ్డి (700/720 మార్కులు)

● ఢిల్లీ ఎయిమ్స్‌లో మెడిసిన్ చేయాలన్నదే లక్ష్యం



నీట్‌లో టాప్ ర్యాంకు సాధించి ఢిల్లీ ఎయిమ్స్‌లో మెడికల్ చేయాలన్నదే లక్ష్యం. నీట్‌లో అత్యధిక మార్కులు సాధించడానికి కళాశాల అధ్యాపకుల బోధనకు తోడు మెటీరియల్, పాఠ్యపుస్తకాలు రివిజన్ చేయడం వల్లనే సాధ్యమైంది. కర్నూలు బాలాజీ నగర్‌లో నివాసం. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు అబ్దుల్ మజీద్, తల్లి షాలిబీ (గృహిణి). 1 నుంచి 10వ తరగతి వరకు కర్నూలు సంకల్‌బాగ్‌లోని శ్రీచైతన్య పాఠశాల, కర్నూలు నారాయణ జూనియర్ కళశాలలో ఇంటర్ చదివారు. ఇంటర్‌లో 972 మార్కులు సాధించారు. డాక్టరునై పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నది లక్ష్యం.

- పి.మహ్మద్ ఇర్ఫాన్ (685/720 మార్కులు)

కేఎంసీ టీడీపీ కైవసం అవుతుంది

- వైసీపీని వీడి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు
- కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్



టీడీపీలో చేరుతున్న కార్పొరేటర్లతో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూన్ 5: కర్నూలు నగర పాలక సంస్థ టీడీపీ కైవసం అవుతుందని కర్నూలు టీడీపీ ఎమ్మెల్యే టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని టీజీ భరత్ కార్యాలయంలో 3వ వార్డు కార్పొరేటర్ షాజ్ హన్ పర్వీన్, 6వ వార్డు కార్పొరేటర్ షేక్ నీలోఫర్, 13వ వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మిలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమెల్యే టీజీ భరత్ వీరికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే టీజీ భరత్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యేగా తన నాయకత్వంలో పని చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందని కార్పొరేటర్లు గ్రహించారన్నారు. అందుకే కార్పొరేటర్లు సైతం జైకొట్టి తమ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. వీరే కాకుండా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు పలువురు కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వ హయంలో కార్పొరేషన్ నిధులను సక్రమంగా వినియోగించి నగరాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామన్నారు. పార్టీలోచేరిన వారిలో నాయకులు క్రిష్ణ, ఖాదర్‌బాషా, హకీమ్, షేక్ నజీర్, ఉన్నారు.

అందరికీ అభినందనలు: ఎస్పీ



కర్నూలు, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర బలగాలు, ఇతర శాఖల అధికారుల కృషి, సేవలు అభినందనీయమని ఎస్పీజి. కృష్ణకాంత్ తెలిపారు. బుధవా రం ఆయన మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియాకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావ రణంలో ఎన్నికల విధులను జిల్లా పోలీసు యంత్రాంగం, కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు (ఎస్ఎస్‌బీ అస్సాం, ఎస్ఎస్‌బీ గుజరాత్, ఎస్ఏపీ గుజరాత్, సీఆర్‌పీఎఫ్, బీఎస్‌పీ, గ్రేహౌండ్స్ ఏపీఎస్‌పీ కేరళ, ఎస్ఏపీ కర్ణాటక పోలీసులు, హోంగార్డులు, ఎస్ఏఆర్ అంబర్‌పేట, పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, ఎస్‌పీఎఫ్), అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేశారని అన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి



సూపరింటెండెంట్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 5: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం పని చేస్తుందని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డిని ఆయన సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులను సత్వరమే పరిష్కరించాలని సూపరింటెండెంట్‌ను కోరారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఉద్యోగి పని చేయాలన్నారు. సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ కార్యక్రమంలో ఏపీఎన్జీవో జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్, కర్నూలు నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి, మధుసూదన్, తాలుకా అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లె శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీలు వరలక్ష్మి, రాజశేఖర్, రేడియోగ్రఫర్ లక్ష్మీనారాయణ, ఫార్మసిస్టు శర్మ పాల్గొన్నారు.

అత్యధిక స్థానాలతో చారిత్రాత్మక గెలుపు

చంద్రబాబు అరెస్టు రోజే జగన్ పతనం ఆరంభం

ఐదేళ్లుగా కేసులు, అణచివేతలతో ఇబ్బంది పడిన క్యాడర్

ప్రాజెక్టులు, అభివృద్ధి, సంక్షేమమే ఎంపీ, ఎమ్మెల్యేల లక్ష్యం

కార్యకర్తల కష్టాన్ని గుర్తుంచుకుంటాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూన్ 5: ఉమ్మడి కర్నూలు జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు టీడీపీకి పట్టం కట్టారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన కార్యకర్తల కష్టం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కష్టకాలంలో పని చేసిన కార్యకర్తలను ఆదుకుంటామన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొత్తగా ఎంపికైన ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ ఎంపీ సంజీవకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో తెలుగుదేశం పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించిన ప్రజానీకానికి, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేయించిన రోజే జగన్మోహన్‌రెడ్డి పతనం మొదలైందని, ప్రజలు పోలింగ్ నాడు ఓటు అనే ఆయుధంతో ఇంటికి పంపారని అన్నారు. అణచివేతలు, వేధింపులు శాశ్వతం కాదని, కేవలం బటన్ నొక్కడం అంతకన్నా..కాదని, అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేసినప్పుడే ప్రజలు నాయకులను విశ్వసిస్తారని అన్నారు. గత ఐదేళ్ల కాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేధింపులు, కేసులు, అణచివేతకు గురయ్యారన్నారు. వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడి పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేశారని అన్నారు. ఫలితంగా జిల్లాలో పోటీ చేసిన అభ్యర్థులు ఊహించని తీరులో గెలిచారని అన్నారు. తాను జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సమయాన ఈ చారిత్రాత్మక విజయం సాధించడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి సైతం కేఈ, కోట్ల కుటుంబాలను స్థాయిని మరచి కించపరిచారని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిచినవారి ముందు ప్రజలు పెద్ద బాధ్యతను ఉంచారని, సమన్వయంతో అందరూ కలిసి పనిచేసి జిల్లాకు ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్, హైకోర్టు బెంచ్‌తో పాటు జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు మాట ఇచ్చి ఫెయిల్ అయిన పనులు పూర్తి చేసి జగన్‌కు చాలెంజ్ విసిరే స్థాయిలో పని చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో రైతులు, నిరుద్యోగులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సామాజిక వర్గం ఎంతో నష్టపోయిందని, ఉత్తుత్తి బటన్ నొక్కి అభివృద్ధి, సంక్షేమం మరిచారని మండిపడ్డారు. పోలింగ్ నాడు రాత్రి ఒంటి గంట వరకు క్యూలో నిలబడి ఓటర్లు ఓట్లు వేసి వైసీపీ పాలనను కూలదోశారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ రాబోయే రెండేళ్లలో గాడి తప్పిన పాలనను పునర్మిస్తామన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ సామాన్యుడికి చంద్రబాబు ఎంపీగా అవకాశం ఇచ్చారని, ప్రజలు ఆశీర్వదించి గెలిపించారని, రుణం తీర్చుకునేలా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాజెక్టులు, అభివృద్ధికి అవసరమైన నిధులు రాబట్టేందుకు ఎమ్మెల్యేలతో కలిసి పని చేస్తానన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అకెపోగు ప్రభాకర్, వై.నాగేశ్వరరావు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, జిల్లా మహిళా అధ్యక్షుడు ముంతాజ్, కుంపటి కృష్ణ, కాసాని మహేష్ గౌడ్, వి.హనుమంతరావు చౌదరి, డి.జేమ్స్ ఎల్లప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు



స్వీట్లు పంచుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు



ప్రజలకు అభివాదం తెలుపుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి



గౌరు దంపతులకు పూలమాలతో సన్మానం



కేఈ శ్యాంబాబును సత్కరిస్తున్న తిక్కారెడ్డి తదితరులు



కోట్లను సత్కరించిన టీడీపీ నాయకులు

తెలుగు తమ్ముళ్ల విజయోత్సవాలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- కిక్కిరిసిన ఎమ్మెల్యేల నివాసాలు, టీడీపీ కార్యాలయాలు



బీవీకి పూలమాలలతో అభిమానుల సత్కారం



మంత్రాలయంలో రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

కర్నూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా తెలుగుతమ్ముళ్లలో మునుపటి జోష్ కనిపించింది. తిరుగులేని విజయాలు సాధించిన టీడీపీ ఎమ్మెల్యేల నివాసాలు, పార్టీ కార్యాలయాలు కార్యకర్తలతో కిక్కిరిశాయి. జిల్లా వ్యాప్తంగా విజయోత్సవాలు అంబరాన్ని తాకాయి. కర్నూలు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ విజయం సాధించి పాతికేళ్ల తరువాత కొండారెడ్డి బురుజుపై పసుపు జెండాను ఎగురవేశారు. టీడీపీ శ్రేణులు, టీజీ అభిమానులు పెద్దఎత్తున బాణా సంచా పేల్చారు. టీజీ భరత్‌ను పూల మాలలతో ముంచెత్తారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డిలను టీడీపీ శ్రేణులు పూలమాలలతో ముంచెత్తారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులను తెలుగుతమ్ముళ్లు ఘనంగా సత్కరించారు. కర్నూలు నగరంలోని వారి ఇంటికి కిలోమీటరుకు పైగా కార్యకర్తలతో జాతరగా మారింది. ఎమ్మిగనూరు నుంచి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన బీవీ జయనాగేశ్వరరెడ్డిని టీడీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. పత్తికొండ నుంచి విజయం సాధించిన విజేత ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును అభిమానులు భారీగా సన్మానించారు. కర్నూలు ఎంపీగా విజయం సాధించిన బస్తిపాటి నాగరాజు, పత్తికొండ విజేత ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. టీడీపీ ఘన విజయాన్ని పురస్కరించుకొని ఆలూరులో టీడీపీ అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఆదోని నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులతో విజయోత్సవాలు చేసుకున్నారు. ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడును టీడీపీ నేతలు గజమాలతో సత్కరించారు.



ఫరూక్‌ను సన్మానిస్తున్న నాయకులు



టీజీ భరత్‌ను సత్కరిస్తున్న దృశ్యం



ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి పుష్పగుచ్ఛం ఇస్తున్న గుడిసె క్రిష్ణమ్మ

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాలు సందడి సందడిగా మారాయి. గెలిచిన తమ నేతను కలిసి ఫొటోలు దిగేందుకు, దండలు వేసి అభిమానాన్ని చాటేందుకు అభిమానుల పోటెత్తారు. నంద్యాలలో ఎమ్మెల్యే ఫరూక్ నివాసంలో సంబరాలు ఘనంగా జరిగాయి. బనగానపల్లెలో బీసీ జనార్దన్ రెడ్డి ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు పోటెత్తాయి. శ్రీశైలం, ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, భూమా అఖిలప్రియ నివాసాలు టీడీపీ శ్రేణులతో కిక్కిరిశాయి. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డిలను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో పాటు ఆయన తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



అఖిలప్రియకు శుభాకాంక్షలు తెలుపుతున్న చాగలమర్రి నాయకులు



మహానందిలో బుడ్డా రాజశేఖరరెడ్డికి సత్కారం



దస్తగిరికి శుభాకాంక్షలు తెలుపుతున్న పసుపుల గ్రామస్థులు



ఎంపీ నాగరాజుకు స్వీట్లు తినిపిస్తున్న మాజీ ఎంపీ



బైరెడ్డి శబరికి శుభాకాంక్షలు తెలుపుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి



నందికొట్కూరులో మాండ్రకు పూలమాలతో స్వాగతం

రాజోలి ఆనకట్టపై పొంగి ప్రవహించిన వరద నీరు



చాగలమర్రి, జూన్ 5: మండలంలోని రాజోలి ఆనకట్టపై బుధవారం వరద నీరు పొంగి ప్రవహించింది. జిల్లాలో ఎగువన కురిసిన వరద నీరు ఆనకట్టకు చేరింది. ఆనకట్టపై పొంగి ప్రవహించినట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట వద్దగల గేట్లను ఎత్తి కడప జిల్లావైపుగల కుందూకు నీటిని విడుదల చేశామని చెప్పారు. కుందూలో 4 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని తెలిపారు. నెల రోజుల నుంచి నీరు లేక ఒట్టిపోయిన రాజోలి ఆనకట్ట వద్ద వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. పరిసర గ్రామాల రైతులు, కూలీలు, మూగ జీవాలకు దాహం తీరినట్లైంది.

యాగంటి ఉమామహేశ్వరుడి కల్యాణం

బనగానపల్లె, జూన్ 5: మండలంలోని యాగంటి ఉమా మహేశ్వర స్వామి క్షేత్రంలో మాసశివరాత్రి సందర్భంగా స్వామివారి కలాణ్యాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్వర శర్మ, ఇతర అర్చకుల ఆధ్వర్యంలో కలాణ్యం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆగని వైసీపీ దాడులు

- టీడీపీ కార్యకర్తల ఇంటికెళ్లి మూకుమ్మడిగా దాడి చేసిన వైనం
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- అలసందగుత్తిలో హైటెన్షన్



గాయపడ్డ పూజారి నాగరాజు



చికిత్స తీసుకుంటున్న బంగారప్ప నాగరాజు

ఆదోని రూరల్, జూన్ 5 : వైసీపీ ఆగడాలను తట్టుకోలేక ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వారిలో మచ్చుకైనా మార్పు రాలేదు. ఇప్పటికీ వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. ఆదోని మండలం అలసందగుత్తిలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి 66 ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఇది జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు మూకుమ్మడిగా టీడీపీ కార్యకర్తల ఇంటికెళ్ళి రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. కూటమి అభ్యర్థి విజయం సాధించడంతో బుధవారం తెలుగుదేశం కార్యకర్తలు పూజారి నాగరాజు, బంగారప్ప నాగరాజు, నరసప్ప గ్రామంలోని చౌడమ్మ దేవాలయానికి వెళ్ళి పూజలు చేసి సంబరాలు చేసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు నాగేంద్ర, సోమలింగ, రవి, సమర, సోమప్ప, ఈరన్న, వెంకటేశులు, తిక్కన్నతోపాటు మరికొందరు పూజారి నాగరాజు, బంగారప్ప నాగరాజు, నరసప్ప ఇండ్లకెళ్ళి రాళ్లు, కట్టెలతో దాడి చేసి, మీరు కూటమి అభ్యర్థికి సపోర్ట్ చేయడంతో 66 మెజార్టీ వచ్చిందని కొట్టారు. ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు ఎర్రిస్వామి, శ్రీనివాసులు, వీరయ్య సంఘటన స్థలానికి చేరుకొని అల్లరి మూకలను చెదరకొట్టారు. గాయపడిన వారిని ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

టీడీపీకి ఓటు వేశారని ముగ్గురిపై దాడి

బనగానపల్లె రూరల్, జూన్ 5 : తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తారా మీ అంతు చూస్తామంటూ వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయి ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని నందవరం గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం గ్రామానికి చెందిన పెద్ద భాస్కరయ్య గారి భాస్కర్, రవి, గోవిందులు నందవరంలోని కమాన్ బస్టాండ్ వద్ద కూర్చొని ఉండగా వైసీపీకి చెందిన దత్తయ్య గారి ఆదిశేషు, అశోక్, రామకిట్టు, శివ, దత్తయ్య గారి రామకిట్టులు గట్టిగా కేకలు వేస్తూ 'నా కొడకల్లారా మీరు తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తారా మిమ్మల్ని చంపితే ఎవరు అడ్డం వస్తారు' అంటూ కర్రలు, ఇనుపరాడ్లు, క్రికెట్ బ్యాట్‌తో విచక్షణా రహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడిలో భాస్కర్, రవి, గోవిందులు తీవ్రంగా గాయాలపాలై బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై నందివర్గం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



వైసీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన భాస్కర్, రవి, గోవిందు

వైద్యులకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్), జూన్ 5: కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యులకు మూడు రోజుల స్క్రీనింగ్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి ఏడుగురు డాక్టర్ల బృందం విశాఖపట్నంలో నిర్వహించిన కేన్సర్ స్క్రీనింగ్‌పై రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బృందం మెడికల్ కాలేజీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 7వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, కేన్సర్ విభాగపు హెచ్‌వోడీ ప్రకాష్, ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, వైస్ ప్రిన్సిపాల్ సాయి నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్యాపిలి, జూన్ 5: మండలంలోని వెంకటాంపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జింకల రమేష్(25) మృతి చెందాడు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన పెద్దన్న కుమారుడు రమేష్ పని నిమిత్తం బైకుపై మండలంలోని రంగాపురం గ్రామానికి వెళ్లాడు. పని పూర్తి చేసుకొని తిరిగి ప్యాపిలికి వస్తుండగా మార్గ మధ్యలోని వెంకటాంపల్లి దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

విజేతలను ఊహించి గెలిచారు..!

- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు'తో ఆంధ్రజ్యోతి పోటీలు
- పక్కాగా అంచనా వేసిన పాఠకులు
- లక్కీడిప్‌లో నలుగురు విజేతల ఎంపిక

కర్నూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకుల అంచనా నిజమైంది. రాజకీయ విశ్లేషణలను పటాపంచలు చేస్తూ పాఠకులు ఖచ్చితమైన తీర్పును అంచనావేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన ఎన్నికల్లో 14 అసెంబ్లీ స్థానాలకు గానూ.. 12 స్థానాల్లో టీడీపీ, రెండు స్థానాల్లో వైసీపీ విజయం సాధిస్తుందని ఫలితాలు రాకనే పాఠకులు వెల్లడించారు. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంచనా వేయాలంటూ ఆంధ్రజ్యోతి పోటీలు నిర్వహించింది. ప్రతీవారం ఆంధ్రజ్యోతి పత్రికలో కూపన్లను ప్రచురించింది. పాఠకులు కూపన్లను భర్తీ చేసి రాష్ట్ర స్థాయిలో విజయవాడ ఆఫీసుకు, జిల్లా స్థాయిలో కర్నూలు ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయానికి పంపారు. ఈ పోటీల్లో ఆంధ్రజ్యోతి పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుందో..? ఊహించి దాదాపు 4 వేలకు పైగా పాఠకులు కూపన్లు కర్నూలు యూనిట్ కార్యాలయానికి పంపారు. బుధవారం యూనిట్ కార్యాలయంలో గెలుపునకు దగ్గరగా అంచనాలు వేసిన కూపన్లను పరిశీలించారు. మెజార్టీ పాఠకులు 14 స్థానాలకు గానూ ఎన్డీఏ కూటమి 10-12 స్థానాలు, వైసీపీ 2-4 స్థానాల్లో గెలుస్తుందని అంచనా వేశారు. కొందరైతే 14 స్థానాల్లో టీడీపీ కూటమే విజయం సాధిస్తుందని ఉహించారు. లక్కీడిప్ ద్వారా డ్రా తీసి నలుగురు విజేతలను ఎంపిక చేశారు. వారిలో ప్రథమ విజేతగా నంద్యాల జిల్లా కొత్తబురుజు గ్రామానికి చెందిన డీవీ మణికంఠేశ్వర రావు ఎంపికయ్యారు. మొదటి విజేతకు రూ.10 వేలు ప్రైజ్‌మనీ అందజేస్తారు. అదేవిధంగా ద్వితీయ, తృతీయ, నాలుగు స్థానాల్లో ఎంపికైన వారికి రూ.5 వేలు చొప్పున ప్రైజ్‌మనీ అందజేస్తారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు లక్ష్మన్, సర్క్యులేషన్ మేనేజరు జి.సోమశేఖర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్ కుమార్‌నాయుడు, బ్యూరో ఇన్‌చారి గోరంట్ల కొండప్ప, సర్క్యులేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.



లక్కీడిప్ తీస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్



మొదటి విజేత : డీవీ మణికంఠేశ్వర రావు, కొత్తబురుజు గ్రామం, డోన్ మండలం నంద్యాల జిల్లా.

2,3,4 విజేతలు : పి.లక్ష్మినరసయ్య, హరివరం గ్రామం, ఉయ్యాలవాడ మండలం, నంద్యాల జిల్లా

బి. శ్రీదేవి, లక్ష్మీపురం గ్రామం, కల్లూరు మండలం.

బి.రెహానా, కృష్ణానగర్, కర్నూలు నగరం.

టీడీపీ శ్రేణుల పూజలు



అయ్యప్ప అలయంలో పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 5: టీజీ భరత్, కేఈ శ్యాంబాబు, గౌరుచరితలు ఎమ్మెల్యేలుగా గెలుపు విలువైందని టీడీపీ రాష్ట్ర కార్య దర్శి కాసాని మహేష్ గౌడ్ అన్నారు. బుధవారం నగరంలోని ఆయ్యప్ప స్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కురుబ సంఘం ధనుంజయులు, మాజీ ఎంపీపీ వాకిటి మాదేశ్, 16 వార్డు సెక్రటరీ పెద్దటేక్ పల్లి విశ్వనాథ్ చౌదరి, నారాయణ, రాము, ఆనంద్, ప్రసాద్ గౌడ్, సంతోష్‌గౌడ్, సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

గూడూరు: చంద్రబాబు సారథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ కురు కుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, యువ టీడీపీ నాయకుడు రేమట వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గూడూరులో కోడుమూరు ఎమ్మెల్యేగా బొగ్గుల దస్త గిరి విజయం సాధించడంతో టీడీపీ శ్రేణులు పాత బస్టాండ్ ప్రాంతంలో బాణ కాల్చి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ యువ నేత రేమట వెంకటేష్, పౌలు, తెలుగు శ్రీనివా సులు, మండల తెలుగు యు వత అధ్యక్షుడు సుమన్ బాబు, టీడీపీ కౌన్సిలర్ కోడుమూరు షాషా వలి, టీడీపీ నాయకులు నాగప్ప యాదవ్, మన్నన్ బాషా, కురువ హనుమంతు, చాంద్ బాషా, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్ ఎస్సీ కాలనీలో కోడుమూరు ఎమ్మెల్యేగా బొగ్గుల దస్తగిరి విజయం సాధించడంతో విష్ణుసేన హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న ఆధ్వర్యంలో బుధవారం బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నాయకులు నాగరత్నం, వెంకప్ప. దేవన్న, షఫ్రక్, బుడ్డన్న, మాదన్న పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడారని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్ బాబు అన్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి విజయం సాధించిన సందర్భంగా బుధవారం బిర్లాకాంపౌండులోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలో గెలు పొందిన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెంకప్ప, మంజునాథ్, బజారి, సుధాకర్, సుమలత, షబ్బీర్, సతీష్ పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో డీన్స్ బాలాజి, సరళ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 5: నీట్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఏజీఎం మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఆలిండియా స్థాయిలో డి.దక్షిత్ 672/720 మార్కులు, జి.రఘు వర్ధన్ రెడ్డి 665, ద్రాక్షాయని 661, ఏ.హరి తాబాయి 658, సి.విష్ణువర్ధన్ రెడ్డి 654, వి.హేమంత్ రెడ్డి 650, జి.సాయి తేజ 650, జి.అరవింద్ ప్రసాద్ 645, కేఎండీ అఫాన్ సులేఖాన్ 630, ఇమామ్ కాశింబీ 625, సుమయ్య తహసీన్ 621, మైత్రి రెడ్డి 612 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్స్ సరళ, బాలాజి పాల్గొన్నారు.

'నారాయణ' విద్యార్థుల జయకేతనం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డీజీఎం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 5: ఎన్‌టీఏ ప్రకటించిన జాతీయ స్థాయి నీట్ పరీక్షలో కర్నూలు నారాయణ విద్యార్థులు జయకేతనం ఎగురవేసిందని నారాయణ కళాశాల యజమాన్యం తెలిపింది. టి.ఫణి .దర్ రెడ్డి 700/720 మార్కులు, పి.మహ్మద్ ఇర్ఫాన్ 685, జి.తేజసాయి 672, కే.తన్మయి 670, జి.పవన్ కుమార్ రెడ్డి 661, ఎన్.బావికారెడ్డి 653, ఎస్.సుమయా 651 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల డీజీఎం గోవర్ధన్ రెడ్డి, డీన్స్ అంజనేయరెడ్డి, విశ్వనాథరెడ్డి, ప్రిన్సిపాల్ కే.హవీలా ప్రసాద్, కౌసల్య, అధ్యాపకులు అభినందించారు.

ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు..



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో జోనల్ ఇన్‌చార్జి రఘువీర్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 5: నీట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ఎస్ ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి రఘువీర్ బుధవారం తెలిపారు. కురువ రమేష్ 630 మార్కులు, మల్లెల కీర్తి 626, విజయానందు 620, రామలక్ష్మి 593, రంజిత్ కుమార్ 576, ఎం.తేజేశ్వర్ 557, ఇందు 552, ఖాజామున్నా 529, చరణ్ తేజ్ 513, లిఖిత 510, వై.నిత్య 507 మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకులను ఆయన అభినందించారు. ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, సీఈవో సురేంద్రరెడ్డి, జీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పాణ్యంపై టీడీపీ జెండా

» గౌరు చరిత విజయంతో అంబరాన్నంటిన సంబరాలు
» ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ శ్రేణుల విజయోత్సవాలు

కల్లూరు, జూన్ 5: తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా 40,591 ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలిచిన గౌరు చరిత పాణ్యం గడ్డపై జెండా ఎగురవేశారు. సౌమ్యురాలిగా పేరున్న గౌరు చరిత సాధారణ ఎన్నికల బరిలో నిలిచి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రత్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై భారీ మెజార్టీతో ఘనం విజయం కైవశం చేసుకున్నారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ కార్యకర్తలకు అండగా నిలిచి ధైర్యం చెబుతూ గౌరు దంపతులు పాణ్యం నియోజకవర్గంలో సీని యర్ ఎమ్మెల్యే బలమైన నాయకుడు కాటసానిపై గెలుపొంది విజయం సాధించడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి.



డీజే పాటలకు నృత్యం చేస్తున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు





గౌరు దంపతులను ఆశీర్వదిస్తున్న కల్లె చంద్రశేఖర్, టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డితో సెల్ఫీలు తిగుతున్న శ్రేణులు

● **గౌరు నివాసంలో అంబరాన్నంటిన సంబరాలు:** పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో విజయ దుందుభి మోగించిన గౌరుచరిత నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం ఉదయాన్నే ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, కల్లూరు రూరల్, అర్బన్ ప్రాంతాల నుండి వేల సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, మహిళలు గౌరు నివాసానికి చేరుకుని తమ అభిమాన ఎమ్మెల్యే చరితమ్మకు అభినందనలు తెలిపారు. పూలదండలతో గౌరు దంపతులను ముంచెత్తారు. పూలబొకేలు అందించి, భారీకేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. డీజే పాటలతో, డప్పు వాయిద్యాలతో సంబరాలు జరుపుకున్నారు. పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో అమ్మ హాస్పిటల్ ప్రాంతం సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గౌరు దంపతులకు వేద ఆశీర్వాదం

కర్నూలు(కల్చరల్): పాణ్యం నియోజకవర్గం నుంచి అఖండ విజయం సాధించిన ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులకు మాధవీ నగర్‌లోని వారి స్వగృహంలో వేద పండితులు వేద ఆశీర్వాదలు అందజేశారు. సంకల్‌బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రాలతో, దుశ్శాలువలతో సత్కరించి వేద ఆశీర్వచనాలు అందజేశారు.

టీజీ భరత్‌కు అభినందనలు





టీజీ భరత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న క్రీడా సంఘాల ప్రతినిధులు,
టీజీ భరత్‌కు తిరుమల ప్రసాదం అందజేస్తున్న సండేల్ చంద్రశేఖర్, రవిచంద్రశర్మ

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 5: కర్నూలు ఎమ్మెల్యేగా ఎన్నికైన టీజీ భరత్‌ను బుధవారం జిల్లా ఒలింపిక్ సంఘం అసోసియేషన్ ప్రతిని ధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ రగ్బీ అసోసియేషన్ అధ్య క్షుడిగా టీజీ భరత్ ఉండటం తమకేంతో గర్వంగా ఉందన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలి, పవరల్ లిఫ్టింగ్ ప్రతినిధి వేణు గోపాల్, సాఫ్ట్‌బాల్ సంఘం వ్యవస్థాపకుడు టి.గంగాదర్, సీలంబం రాఘవేంద్ర, తైక్వాండో వెంకటేశ్వర్లు, హాకీ ప్రవీణ్, హ్యాండ్‌బాల్ వెంకటేశ్ పాల్గొన్నారు.

టీజీ భరత్‌కు సన్మానం

కర్నూలు(అర్బన్): నగరంలోని మౌర్యాఇన్‌లోని టీజీ భరత్ కార్యాలయంలో బుధవారం ఆయనను నగరపాలక సంస్థ టీడీపీ ఫ్లోర్ లీడర్, 8వ వార్డు కార్పొరేటర్ కురువ పరమేష్‌తో కలిసి పలు వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కర్నూలు నగరంలో దశాబ్దాల పాటు టీజీ కుటుంబం ఎన్నో సేవా కార్యక్రమాలతోపాటు అభివృద్ధి పనులు చేసిందని అన్నారు.

టీజీ భరత్‌కు వేద ఆశీర్వాదం

కర్నూలు(కల్చరల్): సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్‌కు బ్రాహ్మణ వేద పండితులు వేద ఆశీర్వాదలు అందజేశారు. బుధవారం నగరంలోని సంకల్ బాగ్‌లోని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో టీజీ భరత్ దంపతులను జిల్లా బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు టీవీ రవిచంద్ర శర్మ, కంచు గంటల శ్యాం సుందర్‌రావులు శాలువలతో సత్కరించారు. అనంతరం తిరుమల ఏడుకొండల స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. బ్రాహ్మణ సంఘం నాయకులు సీవీ దుర్గాప్రసాద్, చల్లా నాగరాజు శర్మ, సముద్రాల శ్రీధర్ బాబు సీఎస్ ప్రసాదరావు, అనూజ్ కుమార్, శ్రీనివాసరాజు, ప్రదీప్ కుమా ర్‌శర్మ, భానుప్రసాద్ (తిరుపతి), జగదీష్, హరిశర్మ, కందాల రామాచారి, కల్లె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు అభినందనలు



బస్తిపాటి నాగరాజుకు అభినందనలు
తెలుపుతున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 5: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కర్నూలులో పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజుకు అవకాశం ఇచ్చి ఎన్నికల్లో ఘన విజయానికి కల్పించినందుకు చంద్రబాబుకు కర్నూలు జిల్లా కురువ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజును కురువ సంఘం నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రంగస్వామి, ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, మహిళా కురువ సంఘం ప్రధాన కార్య దర్శి అనిత, బీసీ తిరుపాలు, పెద్దపాడు పుల్లన్న, కోశాధికారి కేసీ నాగన్న, నగర అధ్యక్షుడు తౌడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 5: సార్వత్రిక ఎన్నికలలో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వానికి ఏపీ వాల్మీకి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నగరంలోని వాల్మీకి యువసేన కార్యాలయంలో కార్యకర్తల సమా వేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోని అత్యధిక జనాభా కలిగిన వాల్మీకుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో వాల్మీకి బో యల ఎస్టీ బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు.

సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

» కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి
» శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు

కర్నూలు(రూరల్) జూన్ 5: కోడుమూరు ఎమ్మెల్యేగా తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. బుధవారం పసుపల గ్రామంలోని స్వగృహంలో ఆయన్ను కోడుమూరు నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే దస్తగిరికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ తన విజయంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందన్నారు. ముఖ్యంగా టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతోనే తనకు విజయం దక్కిందన్నారు. జనసేన, బీజేపీ నాయకులు సైతం తన గెలుపు కోసం ఎంతో శ్రమించారని కొనియాడారు. కోడుమూరు నియోజకవర్గంలో దాదాపు నాలుగు దశాబ్దాల తరువాత టీడీపీకి ప్రజలు పట్టం కట్టారని, ఇది చారిత్రాత్మక విజయమని తెలిపారు. పార్టీ ఎంతో నమ్మకంతో తనకు సీటు ఇవ్వగా, దానిని నిజం చేస్తూ నియోజకవర్గ నాయకులు, ప్రజలు తనకు గొప్ప విజయాన్ని అందించారన్నారు. ప్రజల ఆశయాలు, అవసరాలకు అనుగుణంగా మంచి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్ధాల తరువాత కోడుమూరులో టీడీపీ జెండా ఎగిరిందంటే అందుకు ప్రధాన కారణంగా ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సీటు ఖరారు మొదలుకుని గెలుపు వరకు అన్నీ తానై ముందుండి నడిపించారన్నారు. గత రెండు పర్యాయాలు వైసీపీ ఈ స్థానాన్ని దక్కించుకోగా, ఈ ఎన్నికల్లో వారీ అధిపత్యానికి గండికొడుతూ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రణాళికలు తన గెలుపునకు పాటుపడ్డాయన్నారు.

విష్ణు నివాసం వద్ద కోలాహలం: కర్నూలులోని విష్ణు నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. కోడుమూరు ఎమ్మెల్యేగా బొగ్గుల దస్తగిరి గెలవటంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నగరానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా బొగ్గుల దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డిలను గజమాలతో సత్కరించారు.

గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీరు తీసుకొస్తాం: విష్ణు

కోడుమూరు/ కోడుమూరు(రూరల్): కోడుమూరు పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారంలో భాగంగా గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైప లైను తీసుకొ స్తామని టీడీపీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోరంట్ల గ్రామంలోని లక్ష్మీమాధవస్వామి దేవాలయంలో డి. విష్ణు వర్ధన్ రెడ్డి, బొగ్గుల దస్తగిరి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కును తీర్చుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడుమూరు ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో టీడీపీకి ఓట్లు వేసి బొగ్గుల దస్తగిరిని అఖండ మెజారిటీతో గెలిపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా తీరు స్తాం. ముఖ్యంగా కోడుమూరు పట్టణ ప్రజల చిరకాల కోరిక గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపు ద్వారా నీటిని తీసుకొచ్చి ప్రజలకు మంచినీటి కష్టాలు లేకుండా సమస్యను పరిష్కరిస్తాన్నారు. అలాగే రోడ్లు, చెక్‌డ్యాంలు, చెరువు లకు నీటి మళ్ళింపు, ఎల్లెల్సీ జీడీపీ ప్రాజెక్టుల నుంచి అలాగే వివిధ ఎత్తిపోత పథాకల నుంచి రైతుకు సకాలంలో సాగునీరు అందించి ఆదుకొంటానన్నారు. రాష్ట్రంలో రావణ రాజ్యం పోయి రామ రాజ్యం వచ్చిం దని బొగ్గుల దస్తగిరి అన్నారు. నియోజకవర్గం ప్రజలు తమపై ఎంతో విశ్వాసం ఉంచి ఓట్లు వేసి టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపిం చిన ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సమస్యలను పరిష్కస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేఈ మల్లికార్జునగౌడ్, సర్పంచు బాలక్రిష్ణ, టీడీపీ నాయకులు మధు, తిరుమల్‌నాయుడు, కున్నూరు మధుసూదన్‌నాయుడు, ఎంసీ గిడ్డయ్య, కురువ శీను, రాజు, సి. మధు, డి.గిడ్డయ్య పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న విష్ణు, దస్తగిరి



దస్తగిరికి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



విష్ణువర్ధన్‌రెడ్డికి అభినందనలు తెలిపేందుకు వచ్చిన ప్రజలు

టీడీపీ గెలుపుపై న్యాయవాదుల హర్షం

కర్నూలు(లీగల్), జూన్ 5: తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడంపై కర్నూలు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు మిఠాయిలను పంపిణీ చేశారు. టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్ మాట్లాడుతూ టీడీపీ గెలుపు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. కార్యక్ర మంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసెట్టి శ్రీనివాసులు, లీగల్ సెల్ నాయకులు ఎల్వీ ప్రసాద్, చంద్రశేఖర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ బ్లడ్ బ్యాంకులో పది పడకల ఏఎంసీ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 5: అత్యవసర రోగుల సౌకర్యార్థం ఓల్డ్ బ్లడ్ బ్యాంకులో ఏఎంసీ విస్తరణలో కోసం అదనపు పది పడకలతో అక్యూట్ మెడికల్ కేర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెడెంట్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆసుపత్రి ఆయన పలు విభాగాలను తనిఖీ చేశారు. రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మందులు ఇచ్చుకౌంటర్‌ను మరొక చోటుకు మార్పు చేస్తున్నట్లు తెలిపారు. ఓల్డ్ 24 గంటల ల్యాబ్ వద్ద వెయిట్ రూమ్ పనులను, స్టోర్, డ్రగ్ స్టోర్ రూమ్ న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌ను పరిశీలించారు. సూపరింటెండెంట్ వెంట సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వర రావు, ఏఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల, సునీల్ ప్రశాంత్ ఉన్నారు.

టీడీపీకే జై కొట్టిన కోడుమూరు ఓటర్లు

» పట్టణంలో 3305 ఓట్ల మెజారిటీ
» గూడూరు మండలంలో 6504 ఓట్ల మెజారిటీ

కోడుమూరు, జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల్లో కోడుమూరు పట్టణ ప్రజలు టీడీపీకి పట్టం కట్టారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణ ప్రజలు టీడీపీకే ఓట్లు వేస్తూ వచ్చారు. గతంలో కాంగ్రెస్‌కు కంచుకోట కోడుమూరు నియోజకవర్గం. రాష్ట్ర విభజన అనంతరం కోడుమూరు మండల ఓటర్లు వైసీపీకి ఓట్లు వేసి గెలిపించారు. కోడుమూరు మండలంలో కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కలుపుకొని మొత్తం 13 పంచాయతీలు ఉన్నాయి. గతంలో ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకే మెజారిటీని తెచ్చిపెట్టాయి. అలాగే 2014, 2019 ఎన్నికల్లో మండలంలోని వివిధ గ్రామాలు ఓటర్లు వైసీపీకి ఓట్లు వేస్తే, పట్టణంలో మాత్రం టీడీపీకి మెజారిటీ వచ్చిన దాఖలాలు ఉన్నాయి. గతంలో 800 నుంచి 1800 వరకు టీడీపికి మెజారిటీ వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ఎన్నికల్లో కోడుమూరు పట్టణ ఓటర్లు టీడీపీకి 3305 ఓట్ల మెజారిటీ తీసుకొచ్చారు.

ఓట్లను పరిశీలిస్తే : కోడుమూరు పట్టణంలో 9288 మంది ఓటర్లు టీడీపీకి ఓట్లు వేశారు. 5983 మంది ఓటర్లు వైసీపీకి వేశారు. దీంతో 3305 ఓట్ల మెజారిటీ టీడీపీకి రావడం పట్ల రికార్డు సృష్టించింది. గతం కంటే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి ఓట్ల శాతం మరింత పెరిగింది. మండలంలో కోడుమూరు పట్టణం మినహా 12 పంచాయతీల పరిధిలోని గ్రామాల ఓట్లను పరిశీలిస్తే పోటా పోటీగా టీడీపీ, వైసీపీ మధ్య బలమైన పోటీగా నిలిచాయి. చివరకు వైసీపీకి 125 ఓట్లు ఆధిక్యం తీసుకొచ్చాయి. మండలంలోని వర్కూరు గ్రామంలో టీడీపీకి 566 ఓట్లు మెజారిటీ వచ్చాయి. అలాగే అనుగొండ 523, పులకుర్తి 372, కల్లపరి 25, ప్యాలకుర్తి 88, రామచంద్రాపురం, 137, రామాపురం 75, మెరుగుదొడ్డి, అమడగుంట్ల 205 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చాయి. వైసీపీకి వెంకటగిరి 144, కొత్తపల్లి 20, గోరంట్ల 335, చిల్లబండ 79, ఎర్రదొడ్డి 84, లద్దగిరి 796, అల్లినగరం 222, బైన్‌దొడ్డి 56, ముడుమలగుర్తి 4, క్రిష్ణాపురం 434 ఓట్లు వచ్చాయి. ఈ లెక్కన గ్రామాల్లో టీడీపీకి 15844 ఓట్లు, వైసీపీకి 15969 ఓట్లు పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఓట్ల లెక్క ప్రకారం వైసీపీకి 125 ఓట్లు మెజారిటీ వచ్చింది. అయితే కోడుమూరు పట్టణంలో టీడీపీకి 3305 ఓట్లలో వైసీపీకి వచ్చిన 125 ఓట్లు తీసివేస్తే టీడీపీకి మండల మెజారిటీ సుమారు 3180 ఓట్లు వచ్చినట్లు టీడీపీ నాయకులు అంచనా వేసుకొంటున్నారు.

గూడూరులో టీడీపీ భారీ మెజారిటీ : గూడూరు మండలంలో టీడీపీకి భారీ మెజారిటీ తెచ్చిపెట్టింది. పట్టణంలో 4181 ఓట్లు టీడీపీకి మెజారిటీ రావడం పట్ల టీడీపీ నాయకుల్లో ఆనందం నెలకొంది. మండలం మొత్తం పైన టీడీపీకి 6504 మెజారిటీ వచ్చినట్లు టీడీపీ నాయకులు అంచనా వేస్తున్నారు. గూడూరు మండలంలోని గుడిపాడులో టీడీపీకి 363, చనుగొండ్లలో 379, వై.కానాపురం 215, పెంచికపాడు 392, కె.నాగలాపురం 420, బూడిదపా డు 340, పొన్నకల్ 47, జూలకల్‌లో 1 ఓటు మెజారిటీ వచ్చినట్లు తెలిసింది. 6504 ఓట్ల మెజారిటీ రావడంతో టీడీపీకి గూడూరు మండలం కంచుకోటగా నిలిచింది.

దశలవారీగా విత్తనాలు అందరికీ అందజేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికెర, జూన్ 5: మండలంలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసుకునేందుకు అవసరమయ్యే వేరుశనగ విత్తనాలు దశల వారిగా ఇస్తామని వ్యవసాయ శాఖ అధికారి యు.రవి తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "విత్తనాలు ఎప్పుడిస్తారు".. అనే వార్తకు స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 204 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని తెలిపారు. మండల పరిధిలోని హంపా గ్రామంలో విత్తనాలు చేశారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతుకు విత్తనాలు అందజేస్తామన్నారు. మొత్తం మద్దికెర మండలానికి 840 క్వింటాళ్ల విత్తనాలు రావాల్సి ఉండగా.. ఇప్పటికీ 440 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అనంతరాజు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

● లక్ష రూపాయల నష్టం

గోనెగండ్ల, జూన్ 5: మండల కేంద్రమైన గోనెగండ్లలోని లక్ష్మీపేట కాలనీకి గొల్ల సోమన్నకు చెందిన ఆరు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. దాదాపు రూ. లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు గొల్లసోమన్న తెలిపారు. కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో తన ఏడు ఎకరాల లో పండిన వేరుశనగ గ్రాసాన్ని వాములుగా వేసుకున్నాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాములకు నిప్పుపెట్టారని బాధితుడు వాపోయాడు. మంటలు ఎగిసి పడటంతో స్థానికులు మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ. 1లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


2. మంటలను ఆర్పివేస్తున్న గ్రామస్థులు

కౌతాళంలో కుండపోత వర్షం

కౌతాళం, జూన్ 5: మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం మధ్యాహ్నం దాదాపు గంటకుపైగా కురిగిన కుండపోత వర్షానికి గ్రామంలోని పలుకాలనీలు జలమయయ్యాయి. ముఖ్యంగా మాసలగేరి, బిస్మిల్లా సర్కిల్, వైఎస్ఆర్ నగర్, ఆదోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. వైఎస్ఆర్ నగర్‌లో సరైన డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.

ఎమ్మిగనూరులో దొంగలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 5 : ఎమ్మిగనూరు పట్టణంలో కర్నూలు హైవే రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర దొంగలు పడ్డారు. బుధవారం ఉదయం యథావిధిగా షాపు తెరవగా కూల్‌డ్రింక్ షాప్‌కు వెనుక భాగం నుంచి రంధ్రం చేసి దొంగతనం చేశారని షాపు యజమాని ముఖీమ్ తెలిపారు. పట్టణ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసులు, బాధితుల వివరాల మేరకు.. దొంగలు మొదట రఘు కూల్‌డ్రింక్ షాపుకు రంధ్రం చేసి లోపలికి వెళ్లడానికి ప్రయత్నం చేశారు. అక్కడ ఫ్రిజ్ ఉండడం వల్ల ప్రయత్నం విరమించుకొని పక్కనే ఉన్న రెడ్ చిల్లీ రెస్టారెంట్ దగ్గర మదీన కూల్‌డ్రింక్ షాప్‌కు వెనుక భాగం నుంచి రంధ్రం పెట్టి అందులోని కూల్‌డ్రింక్స్ బాక్సులను, సిగరెట్లతోపాటు రూ 46 వేల నగదు నగదును దొంగలించినట్లు షాపు యజమాని ముఖీమ్ తెలిపారు.

పిడుగు పడి ఐదు మేకలు మృతి

కౌతాళం, జూన్ 5: మండల పరిధిలోని ఉరుకుంద పంచాయతీలోని మజరా గ్రామం ఓబుళాపురంలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపడి 5మేకలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామ సమీపంలోని పొలంలో కోసిగికి చెందిన మేకల కాపరులు మేకలను మేపుతుండగా మధ్యాహ్నం భారీ వర్షం కురియడంతో మేకలను చెట్ల కిందకు తీసుకుపోగా వర్షంలో ఉన్నట్లుండి పిడుగు పడటంతో ఐదు మేకలు అక్కడిక్కడే మృత్యువాత పడినట్లు మేకల కాపరి మలిగేరి అంజనయ్య తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.80వేల వరకు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. మేకలకాపరులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.


మృతి చెందిన మేకలు

పోలీసుల అదుపులో రౌడీషీటర్లు

ఆదోని రూరల్, జూన్ 5 : మండలంలోని తాలుక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో అల్లర్లు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో బుధవారం 12మంది రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

బంగారమ్మ ఆలయం ప్రత్యేక పూజలు

నందవరం, జూన్ 5: మండల కేంద్రంలోని బంగారమ్మ ఆలయంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు బుధవారం ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. దేశంలో చంద్రబాబునాయుడు తిరుగులేని నాయకుడిగా నిలిచారన్నారు. చంద్రబాబు, ఎమ్మిగనూరులో జయనాగేశ్వరరెడ్డి గెలుపొందడంతో ప్రత్యేక పూజలు చేశారు. జయనాగేశ్వరరెడ్డికి మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దరాముడు, ఈరన్న, వెంకటేశ్వర్లు, కొత్తపల్లి వీరేష్, శ్రీనివాసులు, బీమన్న, మల్లప్పగౌడ, షరీఫ్, నరసింహాలు పాల్గొన్నారు.

పట్టణం పసుపుమయం

● ఎమ్మిగనూరులో టీడీపీకి రికార్డు మెజారిటీ
● ప్రభావం చూపని బుట్టా చేనేత కార్డ్..

ఎమ్మిగనూరు, జూన్5: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మిగనూరు పట్టణం పసుపు మయంగా మారింది. పట్టణ ఓటర్లు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డికి భారీ మెజార్టీని కట్టబెట్టారు. పట్టణంలోని 83 బూతుల్లో టీడీపీకి మెజార్టీ దక్కగా కేవలం 10 బూతుల్లోనే వైసీపీ స్వల్ప మెజార్టీ సాధించింది. టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డికి పట్టణంలో 35,016ఓట్లు పోలవ్వగా, వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు 21,207 ఓట్లుమాత్రమే వచ్చాయి. దీంతో మునుపెన్నడూ లేని విధంగా పట్టణంలో 13,809 ఓట్ల మెజార్టీని టీడీపీ సాధించింది. ఇక నందవరం మండలంలో టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డికి 19507 ఓట్లు పోలవ్వగా, వైసీపీ అభ్యర్థికి బుట్టారేణుకకు 17,126 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఇక్కడ 2,381 ఓట్ల మెజార్టీని టీడీపీ సాధించింది. అలాగే గోనేగండ్ల మండలంలో టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి 25,222 ఓట్లు పోలవ్వగా, వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు 22,499 ఓట్లు పోలవ్వగా 2728 ఓట్లు మెజార్టీని టీడీపీ సాధించింది. ఇక ఎమ్మిగనూరు మండలంలో వైసీపీని మెజార్టీని టీడీపీ భారీగా అడ్డుకుంది. ఎమ్మిగనూరు మండలంలో వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు 25,565 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డికి 21,462 ఓట్లు పోలయ్యాయి. దీంతో వైసీపీ 4,103 ఓట్ల మెజార్టీని మాత్రమే సాధించింది.

● ప్రభావం చూపని చేనేత కార్డు

చేనేతలు అధికంగా ఉన్న ఎమ్మిగనూరులో చేనేత ఓట్లు రాబట్టడానికి వైసీపీ చేనేత అభ్యర్థి బుట్టా రేణుకను రంగంలోకి దింపింది. అయితే, ఆమె పట్టణంలోని చేనేతలపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. ఎప్పటి లాగానే చేనేతలు బీవీ కుటుంబానికి మరోసారి అండగా నిలిచాయి. చేనేత వార్డుల్లో బీవీకి పూర్తి ఆధిక్యత లభించింది. దీంతో వైసీపీ వేసిన చేనేత కార్డు పాచిక పూర్తిగా విఫలమయ్యింది.

● మొదటి రౌండ్ నుంచి బీవీ ఆధిక్యత

ఎమ్మిగనూరు అసెంబ్లీ ఓట్ల లెక్కింపు మంగళవారం కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో జరిగింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 2,47,752 మంది ఓటర్లు ఉండగా 2,03,086 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 14 టేబుళ్లలో 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఇందులో టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆది నుంచి ఆధిఖ్యతను కనబరిచారు. 20రౌండ్లలో 14 రౌండ్లలో బీవీకి మెజారిటీ రాగా, కేవలం 6రౌండ్లలో మాత్రమే వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకకు మెజార్టీ వచ్చింది. దీంతో బీవీ జయనాగేశ్వరరెడ్డి 14,816ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

రౌండ్ల వారిగా నమోదైన మెజార్టీ వివరాలు

రౌండు	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
మొదటి రౌండు	4,558	3,572	986(టీడీపీ)
రెండవ రౌండ్	4,269	4714	445(వైసీపీ)
మూడవ రౌండ్	5321	3703	1618(టీడీపీ)
నాల్గవ రౌండ్	4853	4618	235(టీడీపీ)
ఐదవ రౌండ్	5725	4768	957(టీడీపీ)
6వ రౌండ్	4374	4896	522(వైసీపీ)
7వ రౌండ్	5644	2826	2818(టీడీపీ)
8వరౌండ్	6959	3382	3,577(టీడీపీ)
9వరౌండ్	7886	3293	4,593(టీడీపీ)
10వ రౌండ్	6184	3839	2345(టీడీపీ)
11వ రౌండ్	4082	4414	332(వైసీపీ)
12వ రౌండ్	4451	4094	357(టీడీపీ)
13వ రౌండ్	5335	4837	498(టీడీపీ)
14వ రౌండ్	3232	6849	3617(వైసీపీ)
15వ రౌండ్	4873	6022	1149(వైసీపీ)
16వ రౌండ్	5179	5363	184(వైసీపీ)
17వ రౌండ్	5073	3855	1218(టీడీపీ)
18వ రౌండ్	4,997	4501	496(టీడీపీ)
19వ రౌండ్	5360	5018	342(టీడీపీ)
20వ రౌండ్	2057	1832	1025(టీడీపీ)

ప్రజా గళాన్ని వినిపిస్తా : బీవీ



ఎమ్మిగనూరు, జూన్5: శాసనసభలో నియోజకవర్గ ప్రజల సమస్యలపై తనగళాన్ని వినిపిస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా బీవీ భారీ విజయం సాధించడంతో నియోజకవర్గంలోని ఆయా మండలాలు, గ్రామాల నుంచి బుధవారం టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున బీవీ నివాసానికి తరలివచ్చి పూలమాలలతో ముంచెత్తి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీవీ విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో అన్నివర్గాలు ఇబ్బంది పడ్డాయన్నారు. నవరత్నాలు అన్న జగన్‌కు పదోరత్నాన్ని ప్రజలు అందించారని ఎద్దేవచేశారు. చంద్రబాబు, లోకేశ్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎమ్మిగనూరు ప్రజలు నిల బెట్టారని కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా పల్లెనిద్రలు, వార్డు పర్యటనల ద్వారా తెలుసుకున్న సమస్యలను స్థానిక మేనిఫెస్టోను రూపొందించి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పరిష్కారానికి శ్రీకారం చుడతానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని, ఇక రాష్ట్రానికి అన్నీ మంచిరోజులేనని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజలు ఎన్డీఏ కూటమికి గొప్పవిజయాన్ని అందించారన్నారు. తన తండ్రి దివంగతనేత మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా ఎమ్మిగనూరు అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు.

ప్రజా తీర్పును అంగీకరిస్తున్నా..

● పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా
● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూన్ 5: నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని, మంత్రాలయంలోని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి మరింత సేవలు అందిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి, జనసేన మంత్రాలయం ఇన్‌చార్జి, ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న అన్నారు. బుధవారం మండలంలోని మాధవరంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు కష్టపడి పని చేసి విజయానికి దగ్గరగా వచ్చి ఓటమి చవి చూశామన్నారు. ఒక్కసారి ఓటమి వచ్చినంత మాత్రాన భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో పని చేసిన ప్రతి కార్యకర్తలను గుర్తుంచుకుని వారి కష్టసుఖాల్లో పాల్పంచుకుంటానన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి మంత్రాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం కార్యకర్తలతో ఓటమిపై ఆయా మండలాల వారీగా పునరాలోచన చేశారు. అనంతరం నూతన బైక్‌ను నడిపి తెలుగు తమ్ముళ్లను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, భీమరాజు, రామక్రిష్ణ, బొమ్మిశెట్టి నాగరాజు, రామయ్య, బొజ్జప్ప పాల్గొన్నారు.


మోటారు సైకిల్ నడిపి కార్యకర్తలను ఉత్తేజపరిచిన రాఘవేంద్రరెడ్డి

గెలుపులో మంత్రాలయమే కీలకం

మంత్రాలయం, జూన్ 5: వైసీపీ విజయానికి మంత్రాలయం మండలమే కీలకంగా నిలిచింది. మండలంలో వైసీపీకి 7,789 ఓట్ల భారీ మెజారిటీ వచ్చింది. కోసిగి మండలంలో 3,249 మెజారిటీ రాగా, కౌతాళం మండలంలో 2,759 ఓట్లు వచ్చాయి. అయితే.. పెద్దకడుబూరు మండలంలో నువ్వా.. నేనా అన్న రీతిలో జరిగినా పోటీలో 62 ఓట్ల మెజారిటీ టీడీపీకి లభించింది. ప్రధానంగా టీడీపీకి కంచుకోటగా ఉన్న మంత్రాలయంలో 213 ఓట్లు వైసీపీకి రాగా, గ్రామాల్లో 7,776 ఓట్లు వచ్చాయి. అలాగే కోసిగి మండలంలోని కోసిగిలో 588 ఓట్లు వైసీపీకి రాగా గ్రామాల్లో 2,641 ఓట్ల మెజారిటీ వచ్చింది. కౌతాళం పట్టణంలో 497 ఓట్లు వైసీపీకి రాగా, 2,262 ఓట్లు ఆయా గ్రామాల్లో పోలయ్యాయి. పెద్దకడుబూరులో 196 ఓట్లు టీడీపీ మెజారిటీ రాగా, గ్రామాల్లో 134 వైసీపీకి మెజారిటీ వచ్చింది. పెద్దకడుబూరు మండలం పూర్తి స్థాయిలో 62 ఓట్ల స్వల్ప మెజారిటీ వచ్చింది. నాలుగు మండలాల్లో మంత్రాలయం నుంచే 12,882 ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి నాల్గవసారి విజయం సాధించారు.

పత్తికొండలో జనసేన సంబరాలు

పత్తికొండ టౌన్, జూన్ 5: పత్తికొండ పట్టణంలో బుధవారం జనసేన పార్టీ టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

తుగ్గలి, జూన్ 5: టీడీపీ విజయానికి పోరాడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు న్యాయం చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి నాగేంద్రకు పూలమాలలు వేసి సన్మానించారు. అలాగే కేక్ కట్ చేసి పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి, సర్పంచులు రవి, విజయలక్ష్మి, మధుబాబు, గిరిగిట్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణ ప్రధాన లక్ష్యం : కేఈ

పత్తికొండ, జూన్ 5 : పత్తికొండ నియోజకవర్గంలో వలసలనివారణ ప్రదానలక్ష్యంగా ముందుకుసాగుతామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ బంగారుపంటలు పండే భూములుఉన్నప్పటికీ వర్షాధారంపైనే వ్యవసాయం ఆధారపడి ఉండడంతో ఏటారైతులు కరువు పరిస్థిలు చూడాల్సి వస్తోందన్నారు. అందుబాటులో ఉన్న హంద్రీనీవా నీటిని చెరువులకు నింపి ఆయకట్టు పొలాలకు సాగునీరు ఇచ్చేకార్యక్రమానికి తనతండ్రి కేఈ క్రిష్ణమూర్తి నడుంబిగించి 60శాతం పనులుపూర్తి చేశారన్నారు. అయితే, తర్వాత వచ్చిన వైసీపీప్రభుత్వం బటన్‌లు నొక్కిహడావుడి చేసిందేతప్ప ఒక్కచెరువుకు నీరునింపలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసి చెరువులకు నీరునింపడంతోపాటు హంద్రీనీవానీటిని నియోజకవర్గ పరిధిలోని అన్నిగ్రామాలకు తరలించి పొలాలు సస్యశ్యామలంచేసే దిశగా ముందుకుసాగుతామన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకం మరింత బాధ్యత పెంచిందని, ప్రజలనమ్మకాన్ని వమ్ముచేయకుండా వారు ఆశించిన అభివృద్ధిని చేసిచూపుతానని పేర్కొన్నారు.


ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

ఆలూరు, జూన్ 5: ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తారని, టీడీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటానని టీడీపీ ఇన్‌చార్జి, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం ఆలూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తనను ఆదరించి ఓట్లు వేసిన ప్రతి కార్యకర్తకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు కోసం ప్రయత్నించినా.. స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యానన్నారు. కార్యకర్తలు ఎవరూ నిరాశకు గురి కావొద్దన్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, చంద్రబాబు నాయుడు సీఎంగా ఈ నెల 9న ప్రమాణ స్వీకారం చేస్తుండటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీను నెరవేర్చేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆలూరు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. వేదావతి, నగర డోన ప్రాజెక్టులను పూర్తి చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఆయన అభినందనలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు రాంనాథ్ యాదవ్, తిమ్మయ్య, బంగారు పట్టేల్ యాదవ్, రాము యాదవ్, నరసప్ప, నారాయణ, చంద్ర శేఖర్, నెట్టప్ప, కొమ్ము రామాంజినేయులు, ముద్దు రంగ, ప్రహ్లాద్ రెడ్డి సుదాకర్, మసాలా జగన్, రమేష్, బీజేపీ నాయకులు బసవ రాజు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

40 ఏళ్లుగా సేవ చేసా..
23 రోజుల క్రితం వచ్చిన వ్యక్తికి పట్టం కట్టారు

● మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని, జూన్ 5: నియోజకవర్గానికి 40 ఏళ్ల పాటు సర్వీస్ చేసినా.. 23 రోజుల క్రితం వచ్చిన వ్యక్తికి ప్రజలు పట్టం కట్టారని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం ఆయన స్వగృహంలో విలేకరులతో మట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తానని అన్నారు. ముందుగా తనకు 75వేల ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్రమంతా టీడీపీ గాలి వీచిందని, అది ఎలాంటి గాలి అన్నది జగన్‌కు కూడా అంతు పట్టలేదని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడొద్దని, అండగా ఉంటామని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదన్, చంద్రకాంత్ రెడ్డి, రామలింగశ్వర యాదవ్ పాల్గొన్నారు.

కూటమి గెలుపుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 5: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి, ఆదోనిలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి గెలవడంపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అరుంజ్యోతి నగర్‌లో సంబరాలు చేసుకున్నారు. బుధవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బండారి గిడ్డయ్య, మాదిగ వన్నెల, మణికంఠ, కాంతరాజు, దత్తు మాట్లాడుతూ తమ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ దేశవ్యాప్తంగా ఎన్డీఏ కూటమికి మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. దేశంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాన్, అధికారంలోకి రావాలని ఆకాంక్షించారన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలంతా సంపూర్ణ మద్దతు తెలిపి గెలుపు కోసం కృషి చేశామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే వర్గీకరణ జరిగి మాదిగలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయుకులు పరమేష్, విజయరాజు, ఉలిగప్ప, పరిషప్ప పార్థసారథి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల ఆర్థిక చేయూత

కోసిగి, జూన్ 5: స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో ప్రైవేటుగా ఉద్యోగిగా పనిచేస్తున్న చిన్నారెడ్డి అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. స్టేట్ బ్యాంకులో పని చేసిన ఉద్యోగులు, బ్రాంచి మేనేజర్ అనిల్ కుమార్, రాఘవేంద్ర, ఈరేష్ తదితర ఉద్యోగులు చిన్నారెడ్డి కుటుంబానికి రూ.55వేలు నగదు, రూ.5వేలు నిత్యావసర సరుకులు బాధిత కుటుంబానికి అందజేసి చేయూతనిచ్చారు.

ఫ్యాన్ రెక్కలు విరిచిన ప్రజలు

కోసిగి, జూన్ 5: రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పట్టి ఫ్యాన్ రెక్కలు విరిచేశారని కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, చింతలగేని నర్సారెడ్డి అన్నారు. కోసిగి వైసీపీ మాజీ జడ్పీటీసీ వంట ఏజెన్సీ నిర్వాహకురాలు మంగమ్మ వైసీపీ అధికారంలోకి వస్తుందని రూ.20లక్షలు పందెం కాయడం ఎన్నికల కోడ్ ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి గాలి విచినప్పటికీ మంత్రాలయం నియోజకవర్గంలో మాత్రం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డిని కొంతమంది నాయకులు మోసం చేయడం వల్లే ఓడిపోయారని అన్నారు. అనంతరం టీడీపీ నాయకులు, క్యాకర్తలు స్వీట్లు పంపిణీ చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

టపాసులు పేల్చిన వ్యక్తిపై దాడి

ఆదోని, జూన్ 5: స్థానిక ఎంఎం కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు నాగసేన కూటమి గెలిచిందని ఆనందంతో తన ఇంటి ఎదుట టపాసులు పేల్చాడు. దీన్ని జీర్ణించుకోలేని అదే కాలనీకి చెందిన వైసీపీ కౌన్సిలర్ చిన్నతో పాటు ఆయన అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయాలపాలైన నాగసేనను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి జనసేన ఇన్‌చార్జి మల్లప్ప ఆసుపత్రి చేరుకొని చికిత్స పొందుతున్న నాగసేనను పరామర్శించారు.

ఆధిక్యత గ్రామాల్లో ఆనందోత్సాహాలు

జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ కనీవినీ ఎరుగని విజయాలను నమోదు చేయడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆయా మండల కేంద్రాల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా సంబరాలు జరుపుకున్నారు. మెజార్టీ సాధించిన గ్రామాల్లో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

గోనెగండ్ల మండంలో 12 గ్రామాలలో టీడీపీకి మెజార్టీ

గోనెగండ్ల, జూన్ 5: గోనెగండ్ల మండలంలో పదేళ్ల తరువాత తెలుగుదేశం పార్టీకి మెజార్టీ ఓట్లు వచ్చాయి. మండలంలో టీడీపీ శ్రేణుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మే 13 న జరిగిన ఎన్నికల్లో టీడీపీకి మండలం వ్యాప్తంగా 2153 ఓట్ల మెజార్టీ వచ్చింది. 2019 లో జరిగిన ఎన్నికల్లో 12500 ఓట్లు వైసీపీకి మెజార్టీ వచ్చింది. ఈ సారి మండలంలో టీడీపీ బలం పుంజుకొని సత్తను చాటింది. మండలంలో టీడీపీకి పుట్టపాశం లో 306, హెచ్ కైరవాడిలో 568, గోనెగండ్లలో 1435, ఐరన్‌బండలో 110, గాజులదిన్నెలో 118, పిల్లిగుండ్లలో 112, నెరుడుప్పలలో 130, ఒంటెడుదిన్నెలో 4, బోదేపాడులో 193, వీరంపల్లిలో 378, లింగందిన్నెలో 263, కున్నూరులో 326 ఓట్ల మెజార్టీ సాధించింది. అలాగే మండలంలో వైసీపీకి పెద్దమరివీడులో 56, అలువాలలో 416, చిన్నమరివీడులో 21, పెద్దనేలటూరులో 254, చిన్ననే లటూరులో 55 , వేముగోడులో 178, కులుమాలలో 430, గంజహళ్లిలో 88, అయ్యకొండలో 45, అగ్రహారంలో 14, బైలుప్పలలో 85, ఎన్నెకండ్లలో 2, ఎర్రబాడులో 16 , తిప్పనూరులో 130 ఓట్ల మెజార్టీ సాధించారు. మండలంలో మొత్తం మీద టీడీపీకి 2,153 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో టీడీపీ నాయకులు సంబరాలుజరుపుకుంటున్నారు.

మద్దికెర మండలంలో టీడీపీ మెజారిటీ 4022

మద్దికెర, జూన్ 5: మద్దికెర మండలంలో మొత్తం 29,592 ఓట్లు ఉన్నాయి. 24,700 ఓట్లు పోలవ్వగా.. మద్దికెర మండలంలో తెలుగుదేశం పార్టీకి ప్రజలు 4022 మెజారిటీ ఇచ్చి పూర్వ వైభవాన్ని తెచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మద్దికెర మండలంలో తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజారిటీ సాధించి పెట్టింది. మద్దికెరలో 1885, పెరవలి 838, ఎం.అగ్రహారం 426, బురుజుల 314, ఎడవలి 123, మదనంతపురం 233, కొత్తపల్లి 105, బొమ్మనపల్లి 61, హంపా 37 మెజారిటీలు వచ్చాయి. గత 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీకి 4వేల ఓట్లకు పైగా మెజారిటీ రావడంతో ఆ మెజారిటీ క్రాస్ చేసి మద్దికెర మండలంలో మెజారిటీ రావడం పట్ల జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు.

దేవనకొండ మండలంలో వైసీపీ ఆధిక్యం

దేవనకొండ : హోరా హోరిగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మండలంలో వైసీపీ 380 మెజారిటీ సాధించింది. మండలంలో 44 గ్రామాలకు గాను 62 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. మండలంలో టీడీపీ కి 22,102 ఓట్లు ,వైసీపీ కి 22482 ఓట్లు వచ్చాయి. 33 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీకి 3291 ఓట్ల ఆధ్యికం రాగా, వైసీపీకి 29 పోలింగ్ కేంద్రాల్లో 3671 ఓట్ల ఆధిక్యం వచ్చింది. మండలంలోని టీడీపీ మెజారిటీ సాధించిన గ్రామాలు కప్పట్రాళ్ల 454 , దేవనకొండ 1016 ,జిల్లెడబుడకల 209 ,కుంకనూరు 319,పోట్లపాడు165 ,భైరవానికుంట73, నేలతలమర్రి 94, అలారుదిన్నె 104, కూకటికొండ 75, పి.కోటకొండ పోలింగ్ కేంద్రం291లో 201, కరిడికొండ 95 ఓట్ల ఆధిక్యాన్ని టీడీపీ కనబర్చింది. తెర్నేకల్ 1715,మాచాపురం 156, గుండ్లకొండ 132 , కె .వెంకటాపురం 89 , పాలకుర్తి 111 ,కరివేముల 216, పల్లెదొడ్డి 124 , ఐరన్‌బండ 216, పుల్లాపురం 163 ఓట్ల వైసీపీ ఆధిక్యాన్ని చాటుకుంది.


పత్తికొండ నాలుగు స్తంభాల కూడలి వద్ద టీడీపీ శ్రేణుల సంబరాలు

నందవరంలో టీడీపీకి 1455 ఓట్ల మెజార్టీ

నందవరం: మండల కేంద్రమైన నందవరంలో టీడీపీకి 3946 ఓట్లు పోలవ్వగా.. వైసీపీకి 2491ఓట్లు వచ్చాయి.. మొత్తం 1455 ఓట్ల ఆధిక్యాన్ని టీడీపీ నమోదు చేసుకుంది. అలాగే ముగతి గ్రామంలో టీడీపీకి 2085 రాగా వైసీపీకి1790 ఓట్లు వచ్చాయి. టీడీపీ 295 ఓట్ల మెజార్టీ సాధించింది. పొణకలదిన్నెలో టీడీపీకి 49 ఓట్ల మెజార్టీ.. కనకవీడు పేటలో 74, పూలచింతలో 113 టీడీపీ మెజార్టీ సాధించింది. మాచాపురంలో 31, కనకవీడులో 407, గంగవరంలో వైసీపీ ఆధిక్యాన్ని కనబర్చింది. జొహరాపురంలో 80, నాగలదిన్నెలో 335 ఓట్ల మెజార్టీని టీడీపీ సాధించింది. టీ సోమలగూడురులో 77, రాయచోటీటిలో 26 ఓట్ల మెజార్టీని వైసీపీ నమోదు చేసుకుంది. గురుజాలలో టీడీపీకి 46 ఓట్ల మెజార్టీ, హలహర్విలో 36, ధర్మాపురంలో 79, బాపురంలో 72 ఓట్ల మెజార్టీ వైసీపీ తెచ్చుకుంది. జగ్గాపురంలో 14 ఓట్ల మెజార్టీని టీడీపీ నమోదు చేసుకుంది.